క్లుప్తంగా

'అది ప్రభుత్వ భూమి కాదు'

డోర్నకల్: సీపీఐ నాయకులు జెండాలు పాతిన సర్వే నంబర్ 299లోని భూమి ప్రభుత్వ భూమి కాదని సీరోలు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ సమీపంలోని భూమిలో సోమవారం జెండాలు పాతిన సీపీఐ నాయకులు జెండాలు పాతి పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేస్తామని సీపీఐ నాయకులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ ఆర్డీఓ ఆదేశాల మేరకు సర్వే నంబర్‌లోని భూమిని మంగళవారం తహసీల్దార్ పరిశీలించారు. భూమి యజమాని లక్ష్మీనారాయణ తన కుటుంబ సభ్యులతో రెవెన్యూ అధికారులను కలిసి 2.28 ఎకరాల భూమి తమదేనని, భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపారు. తహసీల్దారు మాట్లాడుతూ.. 299 సర్వే నంబర్‌లోని భూమి పట్టాభూమిగా నిర్ధారించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బానోత్ రామా, సర్వేయర్ వెంకన్న పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల వితరణ



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో గాంధీపురం ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు అల్టిమేట్ ఫెండ్స్ యూత్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు రూ. 20 వేల విలువైన స్కూల్‌బ్యాగ్‌లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మైసయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వాణి, కరుణాకర్, యూత్ అధ్యక్షులు గండమల్ల తిరుపతి, బండారి వీరన్న, ఇర్రి మల్లేష్, నర్సింగ అశోక్, ఉపేందర్, సాగర్, బాస్కర్, బన్ను, అనిల్ పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించాలి

చిన్నగూడూరు: 30ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమిలో ప్రభుత్వ కట్టడాలను నిర్మిస్తున్నారని, అందుకు తనకు నష్టపరిహారం ఇప్పించాలని గ్రామస్తుడు కంచనపల్లి వెంకన్న కోరారు. ఈసందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ.. మండల కేంద్రం శివారులోని జయ్యారం క్రాస్ రోడ్డు వద్ద గల తన సొంత వ్యవసాయ భూమి (సర్వే నెంబర్ 91, 92)లో కస్తూర్బాగాంధీ పాఠశాల నూతన భవన నిర్మాణానికి తాను సాగు చేసుకుంటున్న మూడున్నర ఎకరాల భూమిలో 2.15 ఎకరాల భూమిని అధికారులు లాక్కున్నారని తెలిపారు. దీంతో హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. హైకోర్టు సత్వరమే పనులు నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ పనులు కొనసాగుతున్నాయని తెలిపాడు. లాయర్ ద్వారా హైకోర్ట్‌కు తన గోడును విన్నవించుకోగా కలెక్టర్, తొర్రూర్ ఆర్డీఓ, మండల తహసీల్దార్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. జులై 7న హైకోర్ట్‌కు అధికారులు హాజరుకావాలని నోటీస్‌లో పేర్కొన్నారని తెలిపారు. తనకు జరిగిన అన్యాయానికి ప్రభుత్వం నష్టపరిహారం, మరోచోట వ్యవసాయ భూమినైనా ఇప్పించాలని బాధితుడు వెంకన్న తెలిపాడు.

10న దివ్యాంగుల ధర్నా

కురవి: వచ్చేనెల 10న ఢిల్లీలో జరగబోయే దివ్యాంగుల మహాధర్నాను విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రడం గౌరమ్మ, కందిపాటి ఉమేష్, సీతారామయ్య, యాకయ్య, బత్తిని వెంకన్న, రడం సారయ్య, బత్తుల ఉప్పలయ్య, వీరభద్రచారి, ముత్తయ్య, వీరన్న పాల్గొన్నారు.

గుంతలో పడి ఆవు మృతి



బయ్యారం: కేబుల్ వైర్ మరమ్మతు కోసం తీసిన గుంతలో పడి పాడి ఆవు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని గంధంపల్లి సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సంతూలాల్‌పోడు తండాలోని చిర్ర వెంకన్నకు చెందిన పాడి ఆవును మేత కోసం వదిలిపెట్టాడు. మేతకు వెళ్లిన ఆవు రాత్రి వరకు ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం రైతు ఆవు ఆచూకీ కోసం వెతుకుతున్న క్రమంలో ఇల్లందు–మహబూబాబాద్ రహదారి పక్కన గంధంపల్లి సమీపంలో గుంతలో పడి మృతి చెందింది. ఈ సంఘటనలో బాధిత రైతుకు రూ.50వేల నష్టంవాటిల్లింది.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కురవి: ప్రతీ ఒక్కరు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్‌నాయక్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని నేరడ గ్రామంలో కురవి రెండో ఎస్సై మధుబాబు ఆధ్వర్యంలో జాగృతి పోలీస్ కళాబృందం నేతృత్వంలో కళా ప్రదర్శనలు నిర్వహించారు. మూఢనమ్మకాలు, సైబర్ క్రైం, గుట్కా, గంజాయి చెడు అలవాట్లపై కళా ప్రదర్శనలు ఇచ్చారు.

ఘనంగా విద్యా దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పలు పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూంలను ప్రారంభించారు. ముందుగా పాఠశాలల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పలుమార్పులు తీసుకు వచ్చిందని, విద్యారంగ అభివృద్ధికి ప్రాముఖ్యతనిస్తుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రియాంక



గూడూరులో డిజిటల్ క్లాస్ రూంను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సుచిత్ర



మహబూబాబాద్ అర్బన్: నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



కేసముద్రం: ఇనుగుర్తిలో విద్యార్థినుల మానవహారం



డోర్నకల్: గాంధీ సెంటర్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



మరిపెడలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చిన్నగూడూరు: జయ్యారంలో డిజిటల్ క్లాస్‌లను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మ

పథకాలు అర్హులందరికీ వర్తింపజేయాలి

మరిపెడ రూరల్: అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేయాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని బాల్నిధర్మారం, లచ్చతండా, తండధర్మారం, గుర్రప్పతండా, ఎడ్జెర్ల గ్రామ పంచాయతీలలో ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం 9వ రోజు మంగళవారం ఎమ్మెలే రెడ్యానాయక్ పర్యటన కొనసాగింది. బాల్నిధర్మారం గ్రామంలో సుమారు కోటి రూపాలయలతో నిర్మించి సీసీ రోడ్లను ప్రారంభించారు. రూ.10 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇక్కడ 40మంది నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల, 10 మందికి దళిత బంధు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్ శారద , రామడుగు అచ్చుత్‌రావు, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రఘురాములు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: బాల్నిధర్మారంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

కేసీఆర్ అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి

చిన్నగూడూరు: సీఎం కేసీఆర్ అభివృద్ధికి ఆకర్షితులై పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే స్వగృహంలో మరిపెడ మండలం సోమ్లాతండాకు చెందిన కాంగ్రెస్ నుంచి వంద మంది కార్యకర్తలకు ఎమ్మెల్యే రెడ్యా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన సోమ్లాతండా కాంగ్రెస్‌కు చెందిన భూక్య పాప, అజ్మీర హతిరాం, భూక్య ధర్మ, దేవసోత్ రాములు, దేవసోత్ దస్సీ, మలి గంగరాం, దేవసోత్ శంకర్, గుగులోత్ వెంకన్న, లునావత్ రాజేష్ తదితరులు చేరారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కేసముద్రం: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ సూర్య ట్రాన్స్‌ఫోర్ట్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నల్లగొండ వెంకన్న, మౌలానా, యాకన్న, రమేష్, వీరన్న, ఉప్పలయ్య, హుస్సేన్, భాషా పాల్గొన్నారు.

అందని పాఠ్యపుస్తకాలు

మరిపెడ/మరిపెడ రూరల్: విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి మానుకోవాలని పీఆర్టీయూ మరిపెడ మండల శాఖ అధ్యక్షుడు కీసర రమేష్‌రెడ్డి అన్నారు. మరిపెడలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడంలో నిర్లక్ష్యం చూపారన్నారు. వెంటనే పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. ఆయనతోపాటు సంఘం మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్, నాయకులు లింగన్న, కరుణాకర్, వెంకన్న, రామ్మోహన్, నగేష్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని ధర్నా



మహబూబాబాద్: మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్: పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసి సొంతింటి కళ నెరవేర్చాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వీరభవన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. కబ్జాదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా పేదలు గుడిసెలు వేస్తే మాత్రం వెంటనే జేసీబీలతో తొలగించి కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ఇమ్మానియల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, రవి, శ్రావణ్, ఫాతిమా, వీరన్న, రమేష్, చిరంజీవి, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

నెహ్రూసెంటర్: ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం ఆకుల రాజు అధ్యక్షతన సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగూరి రాములు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, సరోజ, వెంకన్న, జయరాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

గార్ల: పాకాల ఏటి బ్రిడ్జి నిర్మాణంపై పాలకులు అసత్య ప్రచారాలు మానుకొని, బ్రిడ్జి నిర్మాణానికి పూనుకోవాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ గార్లలో భారీ ప్రదర్శన నిర్వహించి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట 2గంటల పాటు ధర్నా నిర్వహించారు. 6నెలల క్రితం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బ్రిడ్జి నిర్మాణానికి రూ.9 కోట్లు నిధులు మంజూరయ్యాయని అసత్య ప్రచారం చేశారని, నేటికీ ఒక్క రూపాయి మంజూరు కాలేదని ప్రజాప్రతినిధులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు గౌని భద్రయ్య, జడ ఐలమ్మ, సర్పంచ్ కుసిని బాబూరావు, ఉపసర్పంచ్ భీముడు పాల్గొన్నారు. బీఎస్పీ మండల అధ్యక్షులు అజ్మీర వెంకన్న, ఉమ, జగదీష్ ధర్నాకు సంఘీభావం ప్రకటించారు.



ధర్నా చేస్తున్న నాయకులు

మేధోశక్తిని పెంపొందించడానికే పోటీలు



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ నాయక్

తొర్రూరు: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో యువతలో మేధో శక్తిని పెంపొందించడానికే రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ తెలిపారు. రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జూలై 2న క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు, పోటీల్లో పాల్గొనేవారు 76618 99899 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో మొదటి బహుమతి ల్యాప్‌టాప్, రెండో బహుమతిగా స్మార్ట్‌ఫోన్, ప్రతిభ కనబర్చిన మహిళకు ఎలక్ట్రికల్ స్కూటీని బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, తొర్రూరు, పెద్దవంగర మండలాల అధ్యక్షులు జక్కుల రాంరెడ్డి, ముద్దసాని సురేష్, కౌన్సిలర్ భూసాని రాము, నాయకులు పాల్గొన్నారు.

ఎరుకల అభివృద్ధికి కృషి చేయాలి

తొర్రూరు: ఎరుకల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి అన్నారు. జూలై 6న మహబూబాబాద్‌లో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభ పోస్టర్లను మంగళవారం డివిజన్ కేంద్రంలో సంఘ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శైలజ, నాయకులు సంపత్, నరేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే పల్లెల ప్రగతి

● మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: సీఎం కేసీఆర్ హయాంలోనే పల్లెలు ప్రగతి పథంలో నడుస్తున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని కర్కాల గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం రూ.8.7కోట్లతో చేపట్టనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, సర్పంచ్ సేగ్యం సురేఖ, ఉప సర్పంచ్ పసులాది వెంకన్న, పీఆర్ ఈఈ సురేష్, డీఈ ప్రసన్నకుమార్, మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, ఎంపీడీఓ సింగారపు కుమార్ పాల్గొన్నారు.



కర్కాలలో నూతన పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌ను సత్కరిస్తున్న మంత్రి దయాకర్‌రావు

బీఆర్‌ఎస్ పాలనలో విద్యకు పెద్దపీట

● ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

గార్ల: సీఎం కేసీఆర్ పాలనలో విద్యకు పెద్దపీట వేసి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మన ఊరు–మన బడి పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేశారని ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మంగళవారం గార్లలోని మసీదు సెంటర్‌లో మన ఊరు–మన బడి పథకం కింద నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాలను అదనపు తరగతి గదులను ఆమె లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఈఓ బి.పూల్‌చంద్, హెచ్‌ఎం బోజ్యానాయక్, ఉపాధ్యాయులను సన్మానించి, విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, సర్పంచ్‌లు ధరావత్ సక్రు, ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ వీరన్న, ఎంపీఓ రజిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదుల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అప్పులపాలు చేసిన ఘనత కేసీఆర్‌దే



మాట్లాడుతున్న మురళీనాయక్

గూడూరు: స్వరాష్ట్రంలో ప్రతీ ఒక్కరు ధనవంతుడు కావచ్చని చెప్పిన సీఎం కేసీఆర్, అధికారం చేపట్టాక ప్రజాప్రతినిధులను మాత్రం అప్పులపాలు చేసిన ఘనత మూటగట్టుకున్నాడని కాంగ్రెస్ పార్టీ మానుకోట నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ ఆరోపించారు. మండలంలోని మర్రిమిట్టలో మంగళవారం జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చిందా, సంతృప్తిగా ఉన్నారా అని అడిగారు. దీంతో వారు ఏం ఇచ్చిండు, ఇప్పటి వరకు ఇల్లే ఇయ్యకపాయే, పోడు పట్టా ఇస్తానని మురిపిస్తుండు, మళ్లీ ఎన్నికలు వస్తున్నాయి కదా.. మాటలు చెబుతున్నాడని అసంతృప్తిగా చెప్పారు. అనంతరం మురళీనాయక్ విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలలో అధికారులను పార్టీ కార్యకర్తల్లాగా పనిచేయించుకుంటున్నాడని, ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో పాల్గొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలు గుర్తించి రాబోయో ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కేసీఆర్ పాలనకు అంతం పలుకుతారనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్టి వెంకన్న, అర్రెం వీరస్వామి, బొల్లికొండ మధుగౌడ్, పూజారి శంకర్‌గౌడ్, జాటోతు వాగ్యానాయక్, కిషన్‌రెడ్డి, చీకటి శ్రీనివాస్‌గౌడ్, ఎర్రయ్య, సతీష్, శివ, నాగయ్య పాల్గొన్నారు.

నకిలీ వేబిల్లులతో ఇసుక విక్రయం

మహబూబాబాద్ రూరల్: నకిలీ వేబిల్లు తయారు చేసి ఇసుక విక్రయిస్తున్న ఓ లారీ యజమాని, డ్రైవర్‌పై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ సీఐ వై.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఇల్లందు మండలం గుండాల ప్రాంతం నుంచి ఏపీ 16 టీఈ 6747 నంబర్ గల లారీ పేరుమీద నకిలీ వేబిల్లు తయారు చేసి ఇసుకను మానుకోట జిల్లా ప్రాంతానికి తీసుకువచ్చి విక్రయించారన్నారు. సదరు నకిలీ వేబిల్లు ద్వారా ఇసుక విక్రయం విషయాన్ని మైనింగ్‌శాఖ అధికారులు గుర్తించారన్నారు. ఆ శాఖ పీఓ ఎల్లయ్య ఫిర్యాదు చేయగా లారీ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

సంక్షిప్త సమాచారం

మున్నూరుకాపులకు రుణాలు ఇవ్వాలి

కురవి: బీసీల రూ.లక్ష పథకంలో భాగంగా మున్నూరుకాపులకు రుణాలు ఇవ్వాలని సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఫీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెలరమేష్ పటేల్ మాట్లాడారు. 33 జిల్లా కేంద్రాల్లో వసతిగృహాలు ఏర్పాటు చేయాలని, సంఘానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి లక్ష్మీనారాయణ, పత్తి వెంకన్న, భిక్షపతి, బిక్షమయ్య, వీరన్న పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కేసముద్రం: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఈనెల 26 నుంచి 28వరకు జరగనున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ధర్మన్న భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సూర్యసారథి, నరేష్, మహేష్, సాయి, బన్నీ, వంశీ, నరేష్ పాల్గొన్నారు.

స్థలదాత, కళాకారుడికి సన్మానం

మహబూబాబాద్ రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జిల్లెల్లగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లెల్లగూడెం గ్రామానికి తెలంగాణ సింధు యక్షగాన కళాకారుడు ఇడంపాక మొగిలి, పాఠశాల స్థల దాత వాసం లక్ష్మయ్య, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ వాసం జనార్దన్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గూడూరు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రవి పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

కేసముద్రం: మేరు సంఘం మండల నూతన కమిటీని మంగళవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నట్లు జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్, జిల్లా అడ్‌హాక్ కమిటీ మెంబర్ కోటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడిగా ఆర్.హరికిషన్, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి భిక్షపతి, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, లింగమూర్తి, శ్రీకాంత్, భిక్షపతి, రమేష్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థికి సన్మానం

గార్ల: జేఈఈ అడ్వాన్స్‌లో ఆలిండియా ఎస్టీ విభాగంలో 142 ర్యాంకు సాధించిన బానోత్ ఆకాష్‌ను మంగళవారం గార్లలో బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీర వెంకన్న శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

విద్యార్థినికి నగదు అందజేత

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలో 10/10 సాధించిన నాగేశ్వరిని విద్యాదినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, ఘనంగా సన్మానించారు. రూ.10వేలు నగదు అందజేశారు.

ధ్రువీకరణ పత్రాల జాప్యంపై ఆగ్రహం

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందించే రూ.లక్ష సాయం దరఖాస్తుల గడువు ముగుస్తుందనే ఆందోళనతో మంగళవారం అధికారులు జాప్యం చేస్తున్నారంటూ ఆగ్రహించారు. తమకు వెంటనే ధ్రువీకరణ పత్రాలను అందించాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

కురవి: మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించకుంటే ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పర్యటనలను అడ్డుకుంటామని తెలిపారు. గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలన్నారు. కార్యక్రమంలో వీరేందర్, గంధసిరి జ్యోతిబసు, మురళి, వాసు, జశ్వంత్ పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు

బయ్యారం: మండలంలోని కస్తూరినగర్ గ్రామంలో మంగళవారం బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లిని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ దేవతలకు బోనాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ కృష్ణమురళీతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. డోర్నకల్ ఎస్సై నాగేశ్వరరావు కథనం ప్రకారం వివరాలు.. మండలంలోని రాముతండాకు చెందిన నూనావత్ జగన్ (52) ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈనెల 14న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఖమ్మంలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుమారుడు చంటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కేసముద్రం: మండలంలోని ఆలేరు గ్రామానికి చెందిన బానోతు రమేష్ అనే వ్యక్తి బైక్‌పై కేసముద్రం వైపునకు వెళ్తున్నాడు. ఈక్రమంలో వరంగల్ నుంచి మానుకోట వైపునకు వెళ్తున్న కారును బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రమేష్ గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అదే కారులో గాయాలపాలైన వ్యక్తిని మానుకోట ఆసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో నాయకుడి మృతి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు జినక మల్లయ్య (55) మంగళవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. సంఘం నాయకులు నివాళులర్పించారు.

నేత్రాల సేకరణ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రొద్దుటూరి నారాయణరావు మృతి చెందగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కె.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకట్‌రెడ్డి, కోశాధికారి సి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు రాపర్తి శ్రీనివాస్ మృతుడి కళ్లను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు.

విద్యార్థులకు రాగి జావ పంపిణీ



మహబూబాబాద్ రూరల్: సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మనోవికాసానికి కృషి చేస్తుందని ఎంపీపీ భూక్య మౌనిక అన్నారు. మండలంలోని లక్ష్మీపురం (బి) ఎంపీపీఎస్ ఆవరణలో విద్యార్థులకు దుస్తులు, రాగి జావ మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎండి.షఫియుద్దీన్, భూక్య సురేందర్, హెచ్‌ఎం.భద్రునాయక్, ఎస్‌ఎంసీ చైర్మన్, కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న విద్యార్థుకు రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కౌన్సిలర్ కాలా సురేందర్‌జైన్, హెచ్‌ఎం మరియామాణిక్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



మహబూబాబాద్ రూరల్: పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తే అందరి మన్ననలు పొందుతారని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. పదవి విరమణ పొందిన హోంగార్డు ఆఫీసర్ ఎస్‌కే.మదారుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్పీ ఆయనను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. హోంగార్డు ఆఫీసరుగా అమూల్యమైన సేవలు అందించిన మదారును ప్రతీ ఒక్కరు గుర్తుంచుకుంటారని తెలిపారు. పదవి విరమణ చేసిన మదార్ ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వ వాహనంలో ఆయనను లాంఛనంగా ఇంటికి సాగనంపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, అర్‌ఐలు నరసయ్య, లాల్‌బాబు పాల్గొన్నారు.